


సందడిగా 'ఫ్యాషన్ షో'

కాకతీయ వైద్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 'ఉత్కర్ష-24' కార్యక్రమాల్లో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన ఫ్యాషన్ షో అలరింపజేసింది. వైద్య విద్యార్థులు ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకున్నారు. జంటగా, బృందాలుగా ఇచ్చిన ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. డీజే పాటలకు నృత్యాలు చేశారు. విద్యార్థుల కేరింతలతో కళాశాల ఆవరణలో సందడి నెలకొంది. – న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి



నలుదిశలా.. ఘనకీర్తి చాటేలా!

● పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు..

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం..

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి, ఈనాడు వరంగల్



పర్యాటక ప్రాంతాల్లో అపరిశుభ్రత, ప్లాస్టిక్, చెత్తాచెదారం పేరుకుపోతుండటం ప్రకృతి ప్రేమికులకు ఆందోళన కలిగిస్తోంది. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో గురువారం 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. యువత, వాకర్స్, విద్యార్థుల సహకారంతో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించింది. విద్యార్థులు కట్టడాల ప్రాముఖ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు. స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ.. ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యాటక ప్రాంతాలను కాపాడుకుందామని ప్రతినబూనారు.



ప్రకృతిహితం

ఖిలావరంగల్, వరంగల్ జిల్లా

● **కార్యక్రమం:** పర్యాటక ప్రాంతాలు కాలుష్యమయం కాకుండా ఉండేందుకు ప్రకృతిహితంగా సైకిల్‌పై వెళ్లి సందర్శించడం, సమీపంలో ఉంటే నడక ద్వారా వెళ్లి చూడటం. సైక్లిస్టులు ఉదయం 6 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ముందు సైక్లింగ్ ప్రారంభించి, సుమారు 15 కి.మీ. దూరంలోని వరంగల్ కోటకు చేరుకున్నారు. ఈ ప్రదేశంలో సైకిల్‌పై తిరుగుతూ కీర్తి తోరణాలు, ఖుష్ మహల్ ఇతర ప్రదేశాలను సందర్శించారు. అనంతరం వాకర్స్‌తో కలిసి రాతి గోడ వరకు నడుస్తూ పర్యాటక ప్రాంతాల్లో రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం కట్టడికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు.

● **పాల్గొన్న వారు:** ట్రినిటీ రైడర్స్ వరంగల్ అసోసియేషన్ సభ్యులు జయరాజ్, విద్యాసాగర్, ప్రసాద్, రవికుమార్, వెంకటేశ్వర్లు, సదాశివరెడ్డి, డాక్టర్ ప్రదీప్‌కుమార్, సైక్లిస్టులు, ఖిలా వరంగల్‌లోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 60 మంది

● **సందేశం:** కాలుష్యం బారి నుంచి పర్యాటక ప్రాంతాలకు విముక్తి



అవగాహన

ఇనుగుర్తిలోని కాకతీయుల శిలా శాసనాలు: మహబూబాబాద్ ● కాకతీయులు నిర్మించిన శాసనాలను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన ● జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.యాకయ్య, బి.దేవేందర్ ● భావితరాలకు కాకతీయుల శిలా శాసనాలను అందించాలి. - ఇనుగుర్తి (కేసముద్రం)



శ్రమదానం

కాళేశ్వరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● కాళేశ్వరం హరిత హోటల్ సమీపంలో పిచ్చిమొక్కలు తొలగించడం ● హరిత సిబ్బంది, మేనేజర్ జక్కం సురేష్ ● శ్రమదానం చేద్దాం.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. – కాళేశ్వరం




చైతన్యం

శ్రీ వేంకటేశ్వర స్వామి సమేత పద్మావతి, అలివేలుమంగమ్మ ఆలయం మహబూబాబాద్ జిల్లా ● ఆలయ విశిష్టతపై ఇంటర్మీడియట్ విద్యార్థినులకు అవగాహన ● జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.శేఖర్, ఎస్సై మాలోతు సురేష్, ఆలయ అర్చకులు నందనాచార్యులు, రాంబాబుచార్యులు, ఎంపీటీ యాకయ్య ● ఆలయాలు, పర్యాటక ప్రాంతాల్లో అవగాహన అవసరం – నర్సింహులపేట (డోర్నకల్)



స్వచ్ఛత

పాండవుల గుట్టలు రేగొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● పాండవుల గుట్టల్లో, గుట్టల కింద భాగంలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు ● గ్రామస్థులు, యువకులు ● పాండవుల గుట్టలను అభివృద్ధి చేస్తే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుంది. సందర్శనకొచ్చే వారు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలి. – రేగొండ



బాధ్యత

రామప్ప ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపు ● పాలంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానికులు ● రామప్ప పరిసరాలు శుభ్రత సామాజిక బాధ్యత

– వెంకటాపూర్



పరిశుభ్రత

బొగత జలపాతం ములుగు జిల్లా ● పిల్లల పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు, పొదల తొలగింపు ● అటవీ, జలపాతం రక్షణ సిబ్బంది ● స్వచ్ఛత పాటిద్దాం, పచ్చదనం పెంచుదాం, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యానికి భద్రత – వాజేడు



ప్లాస్టిక్‌పై యుద్ధం

లక్నవరం జలాశయం, ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ● బుస్సాపూర్ మాజీ ఉప సర్పంచి బేతి దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పాశం మాధవరెడ్డి, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది ● పర్యావరణాన్ని రక్షిస్తే మనల్ని మనం కాపాడుకున్నట్లే.. భావితరాలకు బతుకునిచ్చినట్లే. – గోవిందరావుపేట

నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధి



ప్రదర్శనలను తిలకిస్తున్న పాలనాధికారి డా.సత్యశారద

మట్టెవాడ, న్యూస్‌టుడే: నూతన ఆవిష్కరణలతో దేశం అభివృద్ధి చెందుతుందని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద పేర్కొన్నారు. గురువారం వరంగల్ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏవీవీ కళాశాలలో 'సైన్స్ మేళా' ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాలనాధికారి హాజరై.. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 86 మంది విద్యార్థులు ఏర్పాటు చేసిన 48 ప్రదర్శనలు తిలకించారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ.. యువత సైన్స్ అండ్ టెక్నాలజీపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో డీఐఈఓ శ్రీధర్ సుమన్, డీఈఓ జ్ఞానేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఏవీవీ ప్రిన్సిపల్ భుజంగరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాస్, యువజన, క్రీడలశాఖ సిబ్బంది మౌనిక, రమేష్, రాజేందర్, సుమన్ పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్: చేతివృత్తుల ప్రోత్సాహకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకం అమలు తీరుపై జిల్లా పాలనాధికారి డా.సత్యశారద గురువారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో కౌసల్యాదేవి, ఎల్డీఎం రాజు, అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. అనంత లోకాలకే..!



వరంగల్ పోతననగర్ రోడ్డులో నాలా విస్తరణ కోసం నిర్మాణాలు చేపట్టి.. మధ్యలో వదిలేశారు. కొన్ని నెలలుగా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మార్గం కూడా కొద్దిగా కోతకు గురైంది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఏమాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా రాత్రి వేళలో ఈ రోడ్డులో వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. కనీసం నాలా నిర్మాణం పూర్తయ్యే వరకైనా రోడ్డు పక్కన రక్షణ జాలి ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. – ఈనాడు, హనుమకొండ

విదేశాల్లో ఉద్యోగాలకు నమోదు చేసుకోండి

కొత్తవాడ, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉద్యోగాల కోసం అర్హత కలిగిన అభ్యర్థులు నమోదు(ఎన్‌రోల్‌మెంట్) చేసుకోవాలని వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి తెలిపారు. ఈ నెల 27 ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నమోదు ప్రక్రియ ఉంటుందన్నారు. టామ్‌కామ్(తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్), రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణశాఖ ఆధ్వర్యంలో యూఏఈలో ఐటీఐ, డిప్లొమా, బీటెక్ అర్హతతో ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు నంబరు 99854 83931 సంప్రదించాలన్నారు.

ఒళ్లు, కీళ్ల నొప్పులతో సతమతం

జ్వరాలతో మంచం పట్టి కోలుకున్న బాధితులను కాళ్లు చేతులు లాగడం, నీరసం, ఒళ్లు, కీళ్ల, మెడ నొప్పులు వదలడం లేదు. నొప్పుల పుణ్యమా అని ఏ పనులు చేసుకోలేక ఇక్కట్లకు గురవుతున్నారు. నర్సంపేట డివిజన్‌లో వైరల్, డెంగీ జ్వరాల బారిన పడి నానా హైరానా పడుతున్నారు. నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి రోగులతో రద్దీగా ఉండడమేగాక ఒక్కో పడకపై ఇద్దరిని పడుకోబెట్టి వైద్యం అందిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు సైతం రోగులతో నిండిపోతున్నాయి. –నర్సంపేట, న్యూస్‌టుడే



ఒకే పడకపై చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు

కుటుంబమంతా ఆసుపత్రిలోనే..



చెన్నారావుపేట మండలం చంద్రుతండాకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన పాల్తీయా భాస్కర్, శారద, వారి ఇద్దరు కవల పిల్లలు రాము, లక్ష్మణ్ నర్సంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తొలుత తల్లిదండ్రులు మంచం పట్టగా, తరువాత పిల్లలిద్దరు జ్వరం బారినపడ్డారు. కవల పిల్లలు ఒక వార్డులో తల్లిదండ్రులు మరో వార్డులో చికిత్స పొందుతుండగా భాస్కర్ సోదరి నలుగురికి సపర్యలు చేస్తున్నారు.

నాలుగు రోజులైనా తగ్గలేదు:

-సిద్ద సునీత, చిలకమ్మనగర్



జ్వరం, కాళ్లు చేతులు లాగడం, తల నొప్పి వస్తే నాలుగు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరాను. ఇంకా పూర్తిగా నయం కాలేదు. జ్వరం తగ్గినప్పటికీ కాళ్లు చేతులు లాగుతూనే ఉన్నాయి. వైద్యులు ఇచ్చిన మాత్రలు వేసుకుంటున్నా అదుపులోకి రావడం లేదు.

అందరం జ్వరం పీడితులమే:

-అజ్మీర సూరయ్య, బుచ్చినాయక్‌తండా



ఇంట్లో నలుగురం జ్వరంతో మంచం పట్టాం. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాం. రూ.50 వేలు ఖర్చయింది. జ్వరం తగ్గినా నొప్పులు తగ్గడం లేదు. చిన్న పని కూడా చేయలేక ఇబ్బంది పడుతున్నా.

విశ్రాంతి అవసరం

-డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి, వరంగల్

వైరల్ జ్వరం తగ్గినా నొప్పుల తీవ్రత కొన్ని రోజుల దాకా ఉంటుంది. నీరసం నివారణకు కొబ్బరి నీళ్లు, మల్టీ విటమిన్ల సప్లిమెంట్లు తీసుకోవాలి. కొంత మందికి తగ్గేందుకు రెండు, మూడు నెలలు పట్టొచ్చు. ఆందోళన చెందాల్సిన పని లేదు. పోషకాహారంతో పాటు విశ్రాంతి తీసుకోవాలి.

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటాం



కార్మికులకు కిట్లు అందజేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగర శుభ్రత కోసం పాటుపడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటామని, వారి ఆరోగ్య రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా ప్రతిమ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో గురువారం బల్దియా ఇండోర్ స్టేడియంలో పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంకు ఆపరేటర్లకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రేటర్‌లో ఎక్కువ మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారని, వారు క్యాన్సర్ బారిన పడకుండా నిరంతరం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ డా.అశ్విని తానాజీ, కార్పొరేటర్లు తోట వెంకన్న, రవీందర్, సీఎంహెచ్‌వో డా.రాజేష్, టీపీఆర్వో రాజేష్, డీఎఫ్‌ఓ శంకరలింగం, బయాలజిస్టు మాధవరెడ్డి, వైద్యులు డా.అవినాష్ తిప్పని, రాహుల్ నారాయణ్, సుచిత్ర తిప్పని, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయలోపం.. నగర ప్రజలకు శాపం


● కుడా, గ్రేటర్ మధ్య బృహత్ ప్రణాళిక వివాదం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా), గ్రేటర్ వరంగల్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో వరంగల్ నగర ప్రజలు భవన నిర్మాణ అనుమతుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదేళ్లుగా 2041- వరంగల్ నూతన బృహత్ ప్రణాళిక(మాస్టర్‌ప్లాన్) అమలు చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా.. కొత్త మాస్టర్ ప్లాన్ సమగ్ర మ్యాపు, జోన్ల వివరాలు 'కుడా' ప్రణాళిక విభాగం అధికారులు గ్రేటర్‌కు ఇవ్వడం లేదని తెలిసింది. పూర్తి సమాచారం తెలియక పోవడంతో బల్దియా పట్టణ ప్రణాళిక విభాగం భవన నిర్మాణ అనుమతులు(బిల్డింగ్ పర్మిషన్లు) ఆపేస్తున్నారు. ఏమిటని అడిగితే నూతన మాస్టర్ ప్లాన్ వివరాలు సరిగాలేవంటున్నారు. ఏడాదిన్నరగా ఈ వివాదం నెలకొంది. గ్రేటర్ కమిషనర్‌గా, 'కుడా' వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ అశ్విని తానాజీ ఉన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని నగర ప్రజలు కోరుతున్నారు.

వందలాది దస్త్రాలు పెండింగ్

● 'కుడా' రూపొందించిన 2041- బృహత్ ప్రణాళిక ఆది నుంచి వివాదాస్పదమవుతోంది. 2018లో ముసాయిదా విడుదలైంది. 2019లో 'కుడా' పాలక మండలి ఆమోదం తెలిపి, తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖకు పంపించింది. 2021లో మార్చిలో అప్పటి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదంతో కొత్త మాస్టర్ ప్లాన్‌లో అమలులోకి వచ్చింది. రెండేళ్లపాటు గెజిట్ ప్రకటన(నోటిఫికేషన్) జాప్యమై చివరగా 2023 ఆగస్టులో రాజపత్రంలో పెట్టారు. అధికారికంగా ఆమోదం లభించినా.. ఇంత వరకు 'కుడా' ప్రణాళిక విభాగం అధికారులు మాస్టర్ ప్లాన్ సమగ్ర వివరాలు ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి.

● 2016లో ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పొందిన వారికి గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ విభాగం భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడం లేదు. ఎందుకని ప్రశ్నిస్తే 2041- మాస్టర్ ప్లాన్ వివరాలు లేవని తప్పించుకుంటున్నారు. ల్యాండ్ యూసేజ్, జోన్ల వివరాలు తెలియడం లేదంటున్నారు. దీంతో భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సాధారణ, మధ్య తరగతి ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



వరంగల్ నూతన మాస్టర్ ప్లాన్


నేటి నుంచి డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27 నుంచి అక్టోబర్ 5 వరకు హనుమకొండలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగుతుందని డీఈవో డి.వాసంతి గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 274 మంది అభ్యర్థులు ఉన్నట్లు చెప్పారు. అర్హులైన వారు తమ ధ్రువపత్రాల పత్రాలతో హాజరుకావాలని సూచించారు. కాంట్రాక్టు పద్ధతిలో వారిని ఉపాధ్యాయులుగా నియామకాలు చేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: రుణమాఫీ కింద లబ్ధిపొందిన రైతులకు కొత్త రుణాలు ఇవ్వడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. వర్ధన్నపేటలోని డీసీసీబీ బ్యాంకును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంత మంది రైతులకు రుణమాఫీ జరిగింది. ఇంకా ఎంత మందికి జరగాల్సి ఉంది, కొత్త రుణాలు ఎందరికి ఇచ్చారు.. వంటి వివరాలను బ్యాంకు అధికారులను అడిగి తెలుసుకున్నారు. బంగారం సహా ఇతర రుణాల రికవరీలపై ఆరా తీశారు. పీఏసీఎస్ ఛైర్మన్ రాజేశ్‌ఖన్నా, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ సమత, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులోనే భవనం..!



● ధర్మసాగర్ జలాశయంలో ఏడాదిగా పనులు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములు కబ్జాకు గురవుతుండగా, తాజాగా నిర్మాణాలు ప్రారంభించారు.

ఈనాడు, వరంగల్, ధర్మసాగర్, న్యూస్‌టుడే

రాజధాని హైదరాబాద్‌లోని చెరువు శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు కనిపిస్తే 'హైడ్రా' కూల్చేస్తోంది. కొత్తగా వెలుస్తున్న నిర్మాణాలకు కొరడా ఝుళిపిస్తోంది. మన దగ్గర ఏకంగా జలాశయంలోనే ఓ భవనాన్ని నిర్మిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

దేవాదుల ఎత్తిపోతల పథకానికి గుండెకాయ లాంటి ధర్మసాగర్ జలాశయం గ్రేటర్ వరంగల్ ప్రజల తాగునీటికి ప్రధాన వనరు. ఈ చెరువు శిఖంలోనే ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. ధర్మసాగర్ నుంచి ముప్పారం దారిలో ఉన్న జలాశయం శిఖం భూమిలో ప్రైవేటు వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని ఏడాది కాలంగా చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ అడ్డుకోకపోవడం గమనార్హం.

పట్టాభూమైనా అనుమతి లేదు

అనేక గ్రామాల పరిధిలో చెరువు శిఖం భూముల్లో రైతులకు పట్టా భూములు ఉంటాయి. చెరువులో నీళ్లు లేనప్పుడు పంటలు వేసుకుంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదు. ధర్మసాగర్ చెరువు శిఖంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. పట్టాగా భూమి జలాశయంలో ముంపునకు గురికాలేదని, వ్యవసాయ భూమిని 'నాలా' (వ్యవసాయేతర) భూమిగా మార్పిడి చేసుకున్నట్లు సమాచారం. మరో విచిత్రం ఏంటంటే 'నాలా' కన్వర్షన్ తీసుకున్నది ఒక చోట కాగా.. ఇంటి నిర్మాణం జరిగింది మరో ప్రాంతంలో అని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం.

స్థానిక తహసీల్దార్ ఏమన్నారంటే..


ఇది పట్టా భూమి అని, ముంపునకు గురికాలేదని ఆధారాలను చూపించారు. ఇందులో ఎలాంటి అభ్యంతరాలు లేవని, ఒకవేళ ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని సంబంధిత రైతు డిక్లరేషన్ ఇచ్చి నాలా కన్వర్షన్ చేశామని చెప్పారు..

● సంబంధిత యజమానిని 'ఈనాడు' ఫోన్‌లో వివరణ కోరగా ఈ భూమిని రైతు నుంచే కొనుగోలు చేశానని ..శిఖంలో లేదని తెలిపారు.

నోటీసులు జారీ

సాగునీటి పారుదల శాఖ అధికారులు ఇది అక్రమ నిర్మాణమే అని రెవెన్యూ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని అటు అధికారులకు, ఇటు ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో సర్వే నెంబర్ 125లో ఇంటి నిర్మాణం జరుగుతుందని తమకు గత ఏప్రిల్‌లో సమాచారం రాగా వెళ్లి పరిశీలించామని డీఈఈ ప్రశాంతి తెలిపారు. సంబంధిత యజమానికి నోటీసు ఇచ్చామని చెప్పారు. ఎఫ్‌టీఎల్‌లో లేదని, పట్టా భూమిగా చెబుతున్నారన్నారు.. దీనిపై పూర్తి నిర్ధారణ కోసం రెవెన్యూ, నీటిపారుదల శాఖ కలిసి సర్వే చేయడానికి తహసీల్దార్‌కు ఉత్తరం రాశామని అన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు.

● ఇంటి నిర్మాణానికి అనుమతి లేదని, కూల్చివేయమని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కూడా లేఖ రాశామని పేర్కొన్నారు.



వరంగల్ బస్టాండ్ భవన సముదాయం (పాతచిత్రం)



కూల్చి వేసిన అనంతరం ఇలా..

ఉన్నది కూల్చారు.. నిర్మాణం మరిచారు!

రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు ప్రస్తుతానికి ఆర్టీసీ బస్టాండ్ లేదు. ఓరుగల్లు రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో రెండున్నర ఎకరాల్లో ఉన్న పాత బస్టాండ్ భవన సముదాయాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో గతేడాది జూన్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ రూ.73.50 కోట్ల అంచనాతో కొత్త ప్రయాణ ప్రాంగణ నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అనంతరం పాత బస్టాండ్ నేలమట్టం చేశారు. ఏడాదిన్నర గడుస్తున్నా.. పనులు ప్రారంభించడం లేదు. పక్కనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో ప్రయాణికులు ఎండావానల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే గిర్మాజిపేట

ఎన్‌సీసీ జాతీయ శిక్షణకు ఎంపిక



సాయిచందన్

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్) బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ బి.సాయిచందన్ జాతీయ శిక్షణకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ ఎన్.రమణ తెలిపారు. సెప్టెంబర్ 26 గురువారం నుంచి అక్టోబర్ 6 వరకు బెంగళూరులో 20 మందికి 'రేడియో కంట్రోలర్ ఇన్ ఏరో మోడలింగ్ డిజైన్'లో శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. శిక్షణకు బయలుదేరిని సాయిచందన్‌ను రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి రాధిక, ఎన్‌సీసీ అధికారి అనిల్‌కుమార్ తదితరులు అభినందించారు.

శాస్త్రీయ పద్ధతుల్లో నేరాల దర్యాప్తు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే నేరాల దర్యాప్తు శాస్త్రీయ పద్ధతుల్లో చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఠాణాల వారీగా కేసుల నమోదు, విచారణ, నిందితుల అరెస్టు, కేసుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి, డీజీపీ కార్యాలయం నుంచి వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, రౌడీ షీటర్లపై నిఘా పెంచాలని, గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదాల నివారణలపై చర్చించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా.. వంతెన పిల్లర్





ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహబూబాబాద్ - ఇల్లెందు ప్రధాన రహదారిలో బయ్యారం శివారులోగల పాకాలవాగు వంతెనలోని ఓ పిల్లర్ వద్ద భారీగా మట్టి కోతకు గురైంది. పిల్లర్ చుట్టూ సుమారు 8 అడుగుల లోతు గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వంతెన దిగువ భాగానికి వెళ్తున్న రైతులు పిల్లర్ వద్ద ఏర్పడిన గొయ్యిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఆర్అండ్‌బీ ఏఈఈ అనిల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పిల్లర్ వద్ద గొయ్యి పడిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలించి వంతెన జాతీయ రహదారి పరిధిలో ఉన్నందున సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

– న్యూస్‌టుడే, బయ్యారం (మహబూబాబాద్)

పర్యావరణ ప్రేమికుడి ఒంటరి పోరాటం

'ఆయన ఒకసారి జాతిపిత గాంధీజీ వేషం వేస్తారు. మరోసారి మెడలో ప్లాస్టిక్ సీసాల దండలు వేసుకొని కనిపిస్తారు. ఇంకోసారి జెండా పట్టుకొని పాదయాత్ర చేస్తూ దారి వెంట వెళ్లేవారందరినీ పలకరిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసమే ఆయన తపనంతా.'



చెట్లను కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని, చెరువులను కాలుష్య కాసారాలుగా చేయొద్దని ఒంటరి పోరాటం చేస్తున్నారు హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. వృత్తి రీత్యా ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నా.. ప్రవృత్తి మాత్రం పర్యావరణ పరిరక్షణే. అందుకే ఎక్కడ పర్యావరణ వినాశనం జరుగుతోందని తెలిసినా వెంటనే పాదయాత్రగా బయలుదేరి వెళ్లి దాన్ని ఆపాలంటూ గళమెత్తుతారు. –ఈనాడు, వరంగల్

చెరువుల్లోని వ్యర్థాలను ఏరివేస్తూ..

ప్రకృతిని కాపాడాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వాట్సప్ స్టేటస్‌లు పెట్టుకునేవారు, ఫేస్‌బుక్‌లలో పోస్టులు చేసేవారు బోలెడు మంది. ప్రకాశ్ అలా కాదు.. మనం ఆచరించాకే ఇతరులకు చెప్పాలంటారు. ఇటీవల గణేశ్ నిమజ్జనం అయ్యాక ఓరుగల్లులోని చెరువుల వద్దకు వెళ్లారు. ఒక్కో చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాను తొలగించి గట్టుపై కుప్పలుగా పోశారు. వాటిని తీసుకెళ్లాలని బల్దియా సిబ్బందిని కోరారు. వరంగల్ చిన్నవడ్డెపల్లి చెరువు, హనుమకొండ పద్మాక్షి గుండం, కాజీపేట బంధం చెరువుల వద్దకు వెళ్లి తనకు అందినంత మేర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.



ఇటీవల నిమజ్జనం తర్వాత చెరువుల్లోని చెత్తను ఏరివేస్తూ..

● ఈ పర్యావరణ ప్రేమికుడు ప్రతి రెండేళ్లకోసారి మేడారం మహా జాతరకు పాదయాత్రగా వెళతారు. జాతరలో ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రకృతిని కాపాడాలనే సందేశం ఇస్తూ నాలుగు రోజుల పాటు వనదేవతల వద్దకు నడక సాగిస్తారు. గత ఫిబ్రవరిలో జరిగిన జాతరకు వినూత్నంగా జాతిపిత గాంధీజీ వేషం ధరించి దారి వెంట కనిపించిన వారిని పలకరిస్తూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందంటూ సందేశం ఇచ్చారు. పాఠశాల పిల్లలకు అవగాహన కల్పిస్తూ ప్రయాణం సాగిస్తారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మెడలో ప్లాస్టిక్ సీసాలు ధరించి ప్లాస్టిక్ నిర్మూలనపై వైవిధ్యంగా అవగాహన కల్పించారు.

అలా మొదలు..

ప్రకాశ్ 10వ తరగతి వరకు ములుగు జిల్లా మంగపేటలో చదువుకున్నారు. ఆ సమయంలో బిల్ట్ పరిశ్రమ నుంచి కాలుష్యం బాగా వెలువడడంతో బిల్ట్ యాజమాన్యం అప్పుడప్పుడు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటేది. పాఠశాల స్థాయిలో ఆ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పెద్దయ్యాక అటవీ అధికారి పురుషోత్తంతో పరిచయం అయ్యాక పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెరిగింది.

ఒక్కో అడుగు..

● 2018లో ఖైరతాబాద్ మహా గణేశుడి విగ్రహం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించకుండా పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందించాలని పాదయాత్రగా వెళ్లి ఉత్సవ నిర్వాహకులను, కాలుష్య నియంత్రణ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

● వికారాబాద్ వద్ద జాతీయ రహదారి నిర్మాణం కోసం వెయ్యి మర్రిచెట్లను నరికేస్తారని తెలిసి ఓరుగల్లు నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం 'హైదరాబాద్ నేచర్ లవర్స్' సంస్థతో కలిసి చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి వృక్షాల హననాన్ని ఆపాలని ఫిర్యాదు చేయడంతో గ్రీన్ ట్రైబ్యునల్ స్పందించి చెట్ల నరికివేతపై స్టే ఇవ్వడంలో ప్రకాశ్ కృషి కూడా ఎంతో ఉంది.

● ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో దామగుండంలో రాడార్ కేంద్రం ఏర్పాటుపై పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రమంలో త్వరలో అక్కడికి పాదయాత్రగా వెళ్లి తన గళాన్ని వినిపిస్తానని చెబుతున్నారు.



ప్రమాదాన్ని మరిచి.. చరవాణిలో నిమగ్నమై



ఇలా చూస్తుంటే అటో.. ఇటో



ఇలా రాజాలా కూర్చుంటే అంతే..

మిత్రమా.. రెప్పపాటులో చేజారుతుంది జీవితం!

రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం ఏదో ఒకచోట అలాంటి హృదయవిదారక దృశ్యాలు వెలుగుచూస్తున్నాయి. అయినా చాలా మంది ప్రయాణికులు రైలు లోపల నిల్చోవడానికి స్థలం ఉన్నా తలుపు వద్ద కూర్చుని ప్రయాణం చేస్తున్నారు. అక్కడ ఏ ఆధారం లేకుండా ప్రమాదకరంగా నిల్చుంటారు. చరవాణిలో మాట్లాడుతుంటారు. ఇది రైల్వే చట్టాల ప్రకారం నేరం. రూ.300 జరిమానా లేదా ఏడు రోజుల జైలు శిక్ష ఉంటుంది.

ఇదీ పరిస్థితి..

గురువారం సాయంత్రం 5 గంటలకు వడ్డేపల్లి చెరువు వద్ద సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లు ఇంటర్‌సిటీని పరిశీలించినప్పుడు ప్రతి కోచ్‌లోనూ ప్రతి తలుపు వద్ద కూర్చుని ఉన్న ప్రయాణికులు కనిపించారు. వడ్డేపల్లి చెరువు వద్ద రైలు గంటకు 30 కి.మీ. వేగంతో ప్రయాణం చేస్తుండగా 'న్యూస్‌టుడే' తీసిన చిత్రాలు ఇవి..

–న్యూస్‌టుడే, కాజీపేట

కాజీపేట, వరంగల్ జీఆర్‌పీ పోలీసు స్టేషన్ పరిధిలో తలుపు వద్ద కూర్చుని జారి పడి మరణించిన వారి సంఖ్య

సంవత్సరం	సంఖ్య
2021	13
2022	10
2023	18
2024	12

పదేళ్లలో జరగని అభివృద్ధి.. ఏడాదిలో చేసి చూపిస్తా..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాది కాలంలో చేసి చూపిస్తానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తనపై నమ్మకం ఉంచి తనను, తన కుమార్తెను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం ఎప్పటికీ తీర్చలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాటలే కాకుండా దానికి సంబంధించిన ఎజెండాను ప్రకటిస్తున్నట్లుగా వివరించారు. ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అనేక అభివృద్ధి విషయాలపై గంటకు పైగా చర్చించానని చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, సమీకృత భవనాల నిర్మాణం, మొదటి దశలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో పాటుగా మున్సిపాలిటీకి సంబంధించిన జీవో, డిగ్రీ కళాశాల ఏర్పాటు, దేవాదుల కాల్వల మరమ్మతులు.. తదితర అభివృద్ధి పనుల గురించి వివరించగా ముఖ్యమంత్రి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ అభివృద్ధి పనులకు అక్టోబరు చివరి వారంలో ఉత్తర్వులు వస్తాయన్నారు. వెంటనే పనులకు టెండర్లు పిలిచి.. నవంబరు 15 లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్‌కు తీసుకొచ్చి వేలమంది ప్రజల సమక్షంలో శంకుస్థాపన చేసి.. అదే రోజే ఘన్‌పూర్ మున్సిపాలిటీని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రకటించిన అభివృద్ధి పనులను 2026 జూన్ వరకు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని వెల్లడించారు. గాంధీ భవన్, ఏఐసీసీ చుట్టూ తిరిగేవారికి పదవులు రావని.. ప్రజల్లో ఉంటూ వారితో మమేకమై.. సమస్యలు పరిష్కరించేవారికే వస్తాయని కడియం శ్రీహరి మార్కుగా.. దానిని ఘన్‌పూర్‌లో అమలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు పొట్లపల్లి శ్రీధర్ రావు, బెలిదె వెంకన్న, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, మంచాల ఎల్లయ్య, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొంటాం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోడానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తాము సిద్ధంగా ఉన్నామని.. వాటి గురించి తాము ఆందోళన చెందడం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉందని చెప్పారు. తనకు ప్రజాస్వామ్యం, కోర్టులు, ఎన్నికల వ్యవస్థ పట్ల పూర్తి నమ్మకం ఉందని అన్నారు.. పదేళ్లలో 38 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న నీచ చరిత్ర కలిగిన భారాస ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల మీద మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయొద్దని.. ఈ జిల్లాకు ఉన్న చరిత్ర, గొప్పతనాన్ని నాశనం చేయకూడదని ఎంత మొత్తుకున్నా తన మాట వినలేదని.. ఆ విషయంలో నేను ఎదురు తిరిగాను కాబట్టే రెండోసారి నాకు మంత్రి పదవి రాలేదని అన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో వరంగల్ జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించింది. రెండోస్థానంలో కరీంనగర్ నిలిచింది. బాలుర విభాగంలో కరీంనగర్ జిల్లా ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోగా.. రన్నరప్‌గా వరంగల్ జిల్లా నిలిచింది. విజేతలకు ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి దస్రునాయక్, వ్యాయామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కోచ్‌లు సంతోష్, కుమార్, రాజు, కిషన్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు.. కేసులు నమోదు



వరంగల్‌లో ఔషధాలు పరిశీలిస్తున్న అధికారులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణ వైద్యమండలి అధికారులు, వరంగల్ యాంటిక్వాకరీ బృందం గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా.. వైద్యం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. తెలంగాణ వైద్యమండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ డా.నరేష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. వరంగల్ యాంటిక్వాకరీ బృందం, ఐఎంఏ, హెచ్ఆర్‌డీఏ జిల్లా సభ్యులు డా.వద్దిరాజు రాకేష్, డా.అన్వర్‌మియా, డా.వెంకటస్వామి, డా.అజిత్‌పాషాలు హనుమకొండలోని భీమారం, దీన్‌దయాళ్ కాలనీ, వరంగల్‌లోని రామన్నపేటలో తనిఖీలు చేశారు. పలువురు ఇష్టారాజ్యంగా యాంటిబయాటిక్ ఔషధాలు, నొప్పి నివారణ సూదులు(ఇంజక్షన్లు) ఇస్తున్నట్లు గుర్తించారు. వందల సంఖ్యలో స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్ ఔషధాలు, సూదులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు అర్హత లేని వైద్యులపై ఎన్ఎంసీ 34, 54 యాక్టు ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు డా.నరేష్‌కుమార్ తెలిపారు. పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకొని వైద్యులు కాకున్నా.. పరిధి దాటి వైద్యం చేస్తున్న మహేందర్, జ్ఞానేశ్వర్‌లపై చర్యలు తీసుకోవాలని బోర్డుకు సిఫార్సు చేయనున్నట్లు వివరించారు.

నర్సంపేట: నర్సంపేటలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లను వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షల యాక్టుకు లోబడి పరీక్షలు చేస్తున్నారా? లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ యంత్రాలు, రోగుల వివరాల పుస్తకాలతో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

నేడు భవిష్యనిధిపై అవగాహన

కాజీపేట, న్యూస్‌టుడే: భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని జిల్లా కేంద్రాల్లో శుక్రవారం అవగాహన సదస్సులు, గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు వరంగల్ ప్రాంతీయ కమిషనర్ ఎస్.దానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ప్రతిమ క్యాన్సర్ ఆసుపత్రిలో, హనుమకొండ రాంపూర్‌లోని తిరుమల హెచరీస్‌లో, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపాలిటీ, జనగాం సెయింట్ మేరీస్ హైస్కూల్, జయశంకర్ భూపాలపల్లి ఎస్ఆర్ డీజీ స్కూల్, ములుగు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యనిధి ఖాతాదారులు, ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించుకుని వెంటనే పరిష్కారం పొందవచ్చని సూచించారు.

కోర్టు తీర్పు అపహాస్యం చేయడం సరికాదు


వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు గోపాల్ మాదిగ, మహేందర్ మాదిగ, సుధాకర్ మాదిగ డిమాండ్ చేశారు. వర్ధన్నపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపి మీడియాతో మాట్లాడారు.

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

పర్వతగిరి, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు.

పర్యాటక పరిరక్షణకు 'యువ క్లబ్'లు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే



ఉమ్మడి వరంగల్ జిల్లా సుసంపన్నమైన వారసత్వ సంపదకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలో ఎటుచూసినా కాకతీయ కాలంనాటి కళాకృతులు, కట్టడాలు కనిపిస్తుంటాయి. ఉమ్మడి జిల్లాలో వారసత్వ సంపద పరిరక్షణతో పాటు పర్యాటక రంగం అభివృద్ధికి ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి. ఈక్రమంలో సాంస్కృతిక వారసత్వం, పర్యాటక రంగం పట్ల యువతలో ఆసక్తి, అవగాహన, బాధ్యతా భావాన్ని పెంపొందించేందుకు 'యువ టూరిజం క్లబ్ (వైటీసీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ సూచన మేరకు.. ఏడో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న యువతతో క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. వారితో విద్యా, సాంస్కృతిక, పర్యాటక తదితర కేంద్రీకృత కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పర్యాటక రంగంలో యువత ప్రాధాన్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడంతో పాటు క్లబ్‌లలోని సభ్యులను స్వదేశీ టూరిజం అంబాసిడర్లుగా తయారు చేయాలని ప్రయత్నిస్తోంది.

క్లబ్ సభ్యులు ఏం చేస్తారంటే..!

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్, ఒకేషనల్ విద్యాసంస్థల్లో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి విద్యా సంస్థలో 25మంది విద్యార్థులు, వారిని పర్యవేక్షించేందుకు ఇద్దరు టీచర్లు లేదా లెక్చరర్లను ఓ బృందంగా నియమిస్తారు. జిల్లాస్థాయి టూరిజం అధికారి కన్వీనర్‌గా.. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా కొనసాగుతారు. ఏర్పాటైన క్లబ్ సభ్యులు తమ పరిధిలోని ఊరు, మండలం, జిల్లాలోని పర్యాటకం, సాంస్కృతిక, చారిత్రక, వారసత్వ చరిత్ర గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది. స్థానిక ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. పర్యాటక ప్రాంతాలను బృందాలుగా వెళ్లి సందర్శించి, వాటికి ప్రచారం కల్పించాలి. స్మారక చిహ్నాలను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

జిల్లాలో ప్రాధాన్యం..



జిల్లాలోని ప్రాచీన కట్టడాలు, వారసత్వ సంపద పరిరక్షణకు టూరిజం క్లబ్‌లు అవశ్యం. ప్రపంచ వారసత్వ కట్టడంగా రామప్పకు గుర్తింపు లభించిన తర్వాత స్వదేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగింది. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నో పర్యాటక ప్రాంతాలు గుర్తింపునకు నోచుకోకుండా మరుగున పడి ఉన్నాయి. జఫర్‌గఢ్ కోట, కోటగుళ్లు, జానంపేటలోని రాక్షస గూళ్లు, పాండవుల గుట్టలోని రాక్ పెయింటింగ్స్, మరో అంగ్‌కోర్‌వాట్‌గా పిలిచే దేవునిగుట్ట తదితర పర్యాటక ప్రాంతాలు ఆ కోవలోకి వచ్చేవే. ప్రాచీన కట్టడాలను గుర్తించి.. వాటికి ప్రచారం కల్పించడం ద్వారా పర్యాటకులు పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా పర్యాటక రంగానికి ఆర్థిక వనరులు సమకూరే అవకాశం ఉంది.

వరంగల్ జిల్లా వ్యాప్తంగా గురువారం వరకు ఏర్పాటైన టూరిజం క్లబ్‌లు **434**

అభినందనలతో ఆహ్వానం..

వరంగల్ కలెక్టరేట్: రాష్ట్రంలోనే రెండో అత్యధిక యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేయడంలో.. ముఖ్య పాత్ర పోషించిన జిల్లా పాలనాధికారి డా.సత్యశారదను రాష్ట్ర పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో అభినందించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి కలెక్టర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. గురువారం వరకు రాష్ట్రంలో మొత్తం 3,789 టూరిజం క్లబ్‌లు ఏర్పడగా.. మహబూబ్‌నగర్‌లో 1,317, వరంగల్ జిల్లాలో 434 క్లబ్‌లు ఏర్పాటయ్యాయి.

చర్చల ద్వారా అవగాహన కల్పిస్తాం

- శివాజీ, వరంగల్ జిల్లా టూరిజం అధికారి

పర్యాటక రంగం, వారసత్వ సంపద, సంస్కృతిపై విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడంలో భాగంగా క్విజ్, వ్యాసరచన పోటీలు, లోగో డిజైన్స్, పోస్టర్, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహిస్తాం. కార్యశాల(వర్క్‌షాప్‌లు), చర్చల ద్వారా అవగాహన కల్పిస్తాం.

ఉపాధి అవకాశాలు పెరుగుతాయి..

- ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్టీ

ఉమ్మడి జిల్లాలోని వారసత్వ సంపదకు, సంస్కృతికి నిజమైన పరిరక్షకులు యువతే. పాఠశాల, కళాశాల యువతతో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేయడం మంచి పరిణామం. క్లబ్ సభ్యులకు వారసత్వ సంపద, పర్యాటక రంగంపై పూర్తిస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలి. వారికి పర్యాటక రంగంలో టూరిజం గైడ్స్‌గా తదితర మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలి.

మేమున్నాం.. మీకు తోడుగా నర్సంపేట: 99635 59929 కార్పొరేషన్: 98484 09191 వర్ధన్నపేట: 99896 42307 వరంగల్ ఈస్ట్: 97053 46535 (10 AM TO 1 PM)

కార్పొరేషన్: వరంగల్ ప్రాంతం 25వ డివిజన్ నిజాంపురలో వారం రోజులుగా మురుగు కాలువలు తీయడం లేదని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంరాజ్ దృష్టి తీసుకెళ్లగా గురువారం ఉదయం కాలువలు తీయించారు.

☛ 29వ డివిజన్ రామన్నపేట పెద్దమోరీ గల్లీలోనూ గురువారం మురుగు కాలువలు శుభ్రం చేశారు.

ఆర్ఎస్‌నగర్‌లో చెత్త శుభ్రం

స్పందనకు వందనం

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: చింతల్ 36వ డివిజన్ పరిధిలోని ఆర్ఎస్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. కాలనీలో చెత్త కారణంగా దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికుల ఫిర్యాదును శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను వాహనాల్లో తరలించారు.

పూడిక మట్టి తొలగింపు

నర్సంపేట: నర్సంపేట పట్టణం 12వ వార్డులోని డీసీసీ బ్యాంకు ఎదుట మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయిందని స్థానికులు తెలపగా.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పారిశుద్ధ్య కార్మికులు, జవాన్‌ను పంపించి.. శుభ్రం చేయించారు.

కందకం తీయించారు

నర్సంపేట: నర్సంపేటలో కాకతీయ జూనియర్ కళాశాల వద్ద కాలువ లేకపోవడంతో మురుగు నీరు రహదారిపై పారుతోంది. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కౌన్సిలర్ రజిత కలిసి పురపాలక జేసీబీతో అంతర్గత రోడ్డు పక్కన కందకం తీయించారు. మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలి మృతి



నాగమ్మ(పాతచిత్రం)

కరీమాబాద్, న్యూస్‌టుడే: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఉర్సు ప్రతాప్‌నగర్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు బక్కి నాగమ్మ(102) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆమెకు అయిదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, 15 మంది మనుమలు, మనమరాళ్లు ఉన్నారు. బక్కి నాగమ్మ మృతి విషయం తెలిసి స్థానిక 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

దొంగ పట్టివేత

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం సాయంత్రం ఇనుప గ్రిల్స్ ఎత్తుకెళ్తున్న దొంగను సెక్యూరిటీ గార్డు చాకచక్యంగా పట్టుకున్నారు. వారంరోజుల క్రితం దుండగులు రాత్రి వేళలో కొన్ని గ్రిల్స్ తీసుకెళ్లారు. దొంగతనం ఎలా జరిగిందని అధికారులు సీసీ ఫుటేజీ పరిశీలించారు. గురువారం సాయంత్రం చీకటి పడగానే నలుగురు వ్యక్తులు వచ్చారు. ఒకరు గ్రిల్స్ తీస్తుండగా.. సెక్యూరిటీ గార్డు చూసి అతడిని పట్టుకున్నారు. అనంతరం మట్టెవాడ పోలీసులకు అప్పగించారు.

కొండచిలువ కలకలం



కార్పొరేషన్, న్యూస్‌టుడే: బల్దియా ప్రధాన కార్యాలయం పక్కన వినాయక, అమ్మవారి విగ్రహాలు తయారు చేసే స్థలంలో గురువారం రాత్రి 10 గంటల సమయంలో భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. స్థానిక వ్యాపారులు వెంటనే పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖకు చెందిన స్నేక్ క్యాచర్లు రంగంలోకి దిగి 15 అడుగుల కొండ చిలువను బంధించి, హనుమకొండ జంతు ప్రదర్శనశాలకు తరలించారు.

దాడి చేసిన వారిపై కేసు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: పాత గొడవలు మనసులో పెట్టుకొని ఫోర్ట్‌రోడ్ ఏకశిలానగర్‌కు చెందిన చోదకుడు బొడ్డు ప్రవీణ్ ఇంటిపై దాడి చేసిన పలువురిపై మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. బాధితుడి బంధువులైన బొడ్డు శ్రీకాంత్, రేసు గణేష్, రేసు బాబు, రేసు రాధమ్మ, బొడ్డు మేఘన, ధర్మసాగర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్, రాము, యాదమ్మ మరికొంత మంది గురువారం ఇనుప రాడ్డు, కర్రలు, రాళ్లు, కుర్చీలతో ప్రవీణ్‌ను కొట్టారు. అడ్డుకోబోయిన తల్లి రాజమణి, భార్య రాజేశ్వరి వదిన అనూషలపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

పర్వతగిరి, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడ్లకొండ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లకొండ గ్రామానికి చెందిన అల్లునూరి సమ్మయ్య(76) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. గురువారం పింఛను తెచ్చుకుంటానని చెప్పి.. ఇంటి నుంచి వెళ్లిన సమ్మయ్య గ్రామంలోని ఓ మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి భార్య భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బావిలో పడి ఒకరి మృతి

పర్వతగిరి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన గుంజ అబ్బయ్య(86) ఈ నెల 23న మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దుర్వాసన వస్తోందని గురువారం గ్రామానికి చెందిన కుందూరి రాంరెడ్డి బావి వద్ద చూడగా.. అబ్బయ్య మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.



హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో.. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు



నర్సంపేటలో..



నల్లబెల్లిలో..



చింతనెక్కొండలో..



వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



సంగెం మండల కేంద్రంలో..

చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం: జిల్లావ్యాప్తంగా గురువారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, రజక సంఘాల ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చూపిన తెగువని పలువురు వక్తలు కొనియాడారు. నర్సంపేటలో వివిధ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజా, యువజన, సామాజిక, విద్యార్థి, ఉద్యోగ, కుల సంఘాల నాయకులు వేర్వేరుగా జయంతి నిర్వహించారు. కాశీబుగ్గ ఎల్లమ్మ దేవాలయ కూడలిలో నాయకులు స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు.

☛ వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఐలమ్మకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముద్రించిన ఫ్లెక్సీపై ఒకచోట జయంతి, మరో చోట వర్ధంతి అని రాసి ఉండటంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



బట్టలబజార్‌లో..



కాశీబుగ్గ ఎల్లమ్మ దేవాలయ కూడలిలో..



శంభునిపేట కూడలిలో..



రంగశాయిపేటలో.. కేకు కోస్తున్న నాయకులు



గిర్మాజీపేటలోని రజకుల ఆధ్వర్యంలో..



శివనగర్ సీపీఐ కార్యాలయంలో..

ఆడుతూ.. పాడుతూ..!



గొర్రెకుంటలోని ఆనందాశ్రమంలో..

వరంగల్ కలెక్టరేట్, గీసుకొండ(కీర్తినగర్‌కాలనీ): న్యూస్‌టుడే: వారంతా కన్నపిల్లలకు భారమై.. వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు. గురువారం వారంతా ఆడుతూ.. పాడుతూ.. ఆనందంగా గడిపారు. వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని ఆనంద ఆశ్రయ ఛారిటబుల్ ట్రస్టు, అమృత స్మారక, లావణ్య వృద్ధాశ్రమాల్లో క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. వరంగల్ సీడీపీవో విద్య, సీనియర్ అసిస్టెంట్ అరుణదేవి, సిబ్బంది హేమలత, అనిరుద్, సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గీసుకొండ మండలం 16వ డివిజన్ పరిధి గొర్రెకుంటలోని ఆనందాశ్రమంలో వృద్ధులకు ఆటలపోటీలు నిర్వహించారు.

నాసిరకం బేకరీ ఉత్పత్తులు స్వాధీనం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: బేకరీ ఉత్పత్తుల కోసం వాడే సామగ్రి నాసిరకం, కల్తీవి విక్రయిస్తున్న దుకాణాలపై గురువారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు.. మండిబజార్‌లో సంతోష్ కిరాణం, జనరల్ స్టోర్‌లో కల్తీ, కాలం చెల్లిన సామగ్రి బేకరీలకు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచి గురువారం ఇంతేజార్‌గంజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సుమారు రూ.8 లక్షల విలువ చేసే 196 రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమాని సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆహార భద్రత అధికారి సమక్షంలో ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, రంజిత్‌కుమార్, ఎస్సైలు శరత్, వెంకన్న, ఫుడ్‌సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జన్మదిన వేడుకలు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు మరవలేనివని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మన్మోహన్ సింగ్ జన్మదినం సందర్భంగా కేకు కోశారు. నేతలు సత్యనారాయణ, సుధీర్, వెంకటేశ్వర్లు, మైస సురేశ్, సుధీర్, రామకృష్ణ, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని వినతి



కరీమాబాద్, న్యూస్‌టుడే: ఉర్సు రంగలీలా మైదానంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీలను గురువారం కలిసి విజ్ఞప్తి చేసినట్లు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి అవసరమైన అన్నిరకాల ఏర్పాట్లు కార్పొరేషన్ ద్వారా చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. దసరా ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిది మధు, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ట్రస్టు ఛైర్మన్ కోటేశ్వర్, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, రంజిత్‌గౌడ్, సందీప్, అఖిల్‌గౌడ్ తదితరులున్నారు.

మామునూరు పశువైద్య కళాశాలలో వీసీఐ తనిఖీలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పశువైద్య విశ్వవిద్యాలయం, కళాశాలలను జాతీయ పశువైద్య మండలి (వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా-వీసీఐ) గురువారం తనిఖీ చేసింది. హైదరాబాద్ నుంచి ముగ్గురు సభ్యుల బృందం జిల్లాలోని మామునూరు పశు వైద్యకళాశాలను సందర్శించింది. అక్కడి అధ్యాపకులు, సిబ్బంది వివరాలు, ఖాళీలు, మౌలిక సదుపాయాలు, గ్రంథాలయం, వసతిగృహంలో తనిఖీలు నిర్వహించి లోటుపాట్లను నమోదు చేసింది. మామునూరు పశువైద్య కళాశాలకు వీసీఐ గుర్తింపు లేదు. కళాశాలలోని మొదటి, రెండో, మూడో, నాలుగో సంవత్సరం బీవీఎస్సీ కోర్సుకు అనుమతులను గతంలో రద్దు చేసింది. ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అనుమతి లేదు. ఈ నేపథ్యంలో అనుమతుల పునరుద్ధరణకు రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం మళ్లీ దరఖాస్తు చేసుకోగా వీసీఐ బృందం తనిఖీలకు వచ్చింది. మరోవైపు మామునూరు పశు వైద్యకళాశాలలో ఖాళీలున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు హైదరాబాద్ నుంచి 12 మంది ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లను మామునూరుకు పంపారు. వారు వీసీఐ ప్రతినిధుల కంటే ముందే అక్కడికి చేరుకొని విధులు నిర్వర్తించారు. శుక్రవారం కూడా వీసీఐ అక్కడే తనిఖీలు చేపడుతుంది.

కోళ్ల పరిశ్రమ మేనేజర్‌పై ఫిర్యాదు

రాయపర్తి: మండల కేంద్రం శివారులో నిర్వహిస్తున్న కోళ్ల పరిశ్రమ మేనేజర్‌పై రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు గురువారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోళ్ల పరిశ్రమ వ్యర్థాలు మంచినీళ్ల చెరువులో కలుస్తుండటంతో నీరు కలుషితమవుతున్న విషయం తెలిసిందే. బుధవారం ఎస్సారెస్పీ డీఈ కిరణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యుడైన నరేందర్‌కు కోళ్ల పరిశ్రమ మేనేజర్ సంతోశ్ మెహంతి ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో గురువారం కమిటీ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



రైతులకు పొట్లాలు అందజేస్తున్న జీవ నియంత్రణ ప్రయోగశాల సహాయ సంచాలకురాలు బీఎల్ మాధవి

దుగ్గొండి, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి ట్రైకోడెర్మా విరిడిని వినియోగించాలని జీవ నియంత్రణ ప్రయోగశాల సహాయ సంచాలకురాలు బీఎల్ మాధవి సూచించారు. మండలంలోని తిమ్మంపేటలో గురువారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో బీఎల్ మాధవి పాల్గొని మాట్లాడారు. మిరప, పసుపు, మొక్కజొన్న పంటలకు ఈ ఎరువును ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.మాధవి, ఏఈవో వైజయంతి, రైతులు రాజ్‌కుమార్‌రెడ్డి, అశోక్, బాబు, రవికుమార్, ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల ఆరోగ్యంపై పట్టింపేది?

నర్సంపేట, న్యూస్‌టుడే: నవజాత శిశువుల ఆరోగ్యం పట్ల నర్సంపేట ఆసుపత్రి పిల్లల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సర్కారు దవాఖానాలో జన్మించిన శిశువుల బాగోగులను పట్టించుకోకపోవడంతో వారంతా ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. ఇందుకు గురువారం జరిగిన ఘటనే నిదర్శనం. ఖానాపురం మండలం అశోక్‌నగర్‌కు చెందిన రాపాల అంజలికి పురిటినొప్పులు రావడంతో బుధవారం నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. అదేరోజు రాత్రి 8 గంటలకు సాధారణ కాన్పులో బాబు జన్మించాడు. కానీ! పిల్లల వైద్యులు వచ్చి శిశువును చూడలేదు. దీంతో గురువారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు శిశువును ద్విచక్ర వాహనంపై ప్రైవేటు పిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళుతుండగా 'న్యూస్‌టుడే' వారిని పలకరించింది. బుధవారం రాత్రి 8 గంటలకు బాబు జన్మిస్తే ఉదయం 11 గంటలకు వచ్చి టీకా ఇచ్చి వెళ్లారు. పిల్లల వైద్యులు రాకపోవడంతో ప్రైవేటుకు వెళుతున్నామన్నారు. ఆసుపత్రి పిల్లల వైద్య విభాగంలో ప్రొఫెసర్(హెచ్ఓడీ) ప్రతాప్ సహా మొత్తం ఆరుగురు వైద్యులు ఉన్నారు. అయినా సకాలంలో వైద్యం అందకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయాన్ని హెచ్‌వోడీ డా.ప్రతాప్ వద్ద ప్రస్తావించగా.. విషయం నా దృష్టికి రాలేదన్నారు. ప్రస్తుతం హనుమకొండలో సమావేశంలో ఉన్నానని.. విచారణ జరిపి మరోసారి ఇలా జరగకుండా చూస్తామన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నల్లబెల్లి, న్యూస్‌టుడే: భువనగిరిలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. దళిత సంఘాల నాయకులు గురువారం మండలంలోని బస్టాండు ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బట్టు సాంబయ్య, బొట్ల నరేశ్, అనిల్, కుమారస్వామి పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

విలువలతో కూడిన విద్య అవసరం

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు విలువలతో కూడిన విద్య అభ్యసించాలని యోగా గురువు సదానంద బాపూజీ, వ్యక్తిత్వ వికాస నిపుణుడు(మోటివేషనల్ స్పీకర్) వేణుగోపాల్ సూచించారు. నర్సంపేట మండలం మహేశ్వరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం వ్యక్తిత్వ వికాసంపై కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

ఖానాపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య కోరారు. గురువారం మనుబోతులగడ్డ, ధర్మారావుపేటలో ఆ సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, బాధ్యులు నర్సింహులు, రాజశేఖర్, జగన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు పరిశీలన

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: చెన్నారావుపేట మండలంలో పాపయ్యపేట- నర్సంపేట ప్రధాన రహదారిపై కల్వర్టు కుంగిపోయింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కుంగిన కల్వర్టును భవన, రోడ్డు నిర్మాణశాఖ ఏఈ సతీష్‌కుమార్ గురువారం పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానన్నారు. భారీ వాహనాలు జల్లి, ఎల్లాయిగూడెం మీదుగా వెళ్లాలని సూచించారు.

కర్ణాటక తరహాలో అభివృద్ధి చేయండి

ఖానాపురం, న్యూస్‌టుడే: కర్ణాటక తరహాలో రాష్ట్రంలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలని కాకతీయ పాల సహకార సంఘాల అధ్యక్షుడు దేవేందర్‌రావు, ఖానాపురం మండల అధ్యక్షుడు నరేంద్ర గురువారం పేర్కొన్నారు. పాడిరైతులకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయడం శుభపరిణామం అన్నారు. విజయ డెయిరీ అభివృద్ధికి నిధులు ఇవ్వాలన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో పాడి ఫెడరేషన్‌కు పాలక వర్గాలను నియమించాలన్నారు.



నర్సంపేటలో వినతిపత్రాన్ని ఇస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు



దుగ్గొండిలో.. ఎంపీడీఓ అరుంధతికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరసనలు

చెన్నారావుపేట, దుగ్గొండి, నర్సంపేట గ్రామీణం, నల్లబెల్లి, నెక్కొండ, ఖానాపురం, న్యూస్‌టుడే: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని నర్సంపేట నియోజకవర్గంలోని మాజీ సర్పంచులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవిలో ఉన్నప్పుడు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ గురువారం నిరసన తెలిపారు. ఆయా మండలాల్లో ఒకరోజు దీక్ష చేపట్టి అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నర్సంపేటలో అమరవీరుల స్థూపం నుంచి మండల పరిషత్తు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.



నెక్కొండ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట..



ఖానాపురం మండల పరిషత్ ఆవరణలో..

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

గీసుకొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి టి.మధు డిమాండ్ చేశారు. గీసుకొండ మండలం మచ్చాపురం గ్రామంలో గురువారం మండల భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు సంపత్, జిల్లా అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీని ఎన్నుకున్నారు.

జీఓ నెం.25 నిబంధనలు మార్చాలి

గీసుకొండ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సంఖ్యను కుదించే విధంగా అశాస్త్రీయంగా ఉన్న జీఓ నెం.25ను ప్రభుత్వం మార్చాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.గోవిందరావు తెలిపారు. గీసుకొండ మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో గురువారం ఆయన డీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేయించారు. డీటీఎఫ్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా నాయకులు సూరయ్య, రమేశ్ పాల్గొన్నారు.

విద్యుత్తు నియంత్రికల మరమ్మతుపై శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్: టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం హనుమకొండ పెద్దమ్మగడ్డలోని శిక్షణ కేంద్రంలో నియంత్రికల మరమ్మతుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అన్ని విద్యుత్తు నియంత్రిక రిపేరింగ్ షెడ్డుల నుంచి వచ్చిన యజమానులు, పర్యవేక్షకులు, స్కిల్డ్ సిబ్బందికి తోషిబా కంపెనీ నుంచి వచ్చిన నిపుణులతో శిక్షణ ఇప్పించారు. ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్ మాట్లాడుతూ.. నియంత్రికలు మరమ్మతులకు గురైతే 1912 నంబర్‌కు తెలియజేస్తే సంబంధిత అధికారులు పరిష్కరిస్తారన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: 40వ డివిజన్ ఉర్సు చెరువు వద్ద సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ఏర్పాట్లు చేయాలని కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీని కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. చెరువులో గుర్రపు డెక్క, వ్యర్థాలు పూర్తిగా తొలగించాలని, రంగలీలా మైదానంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు.